# రివెంజ్! రివెంజ్!!

MVS PUBLICATIONS

మధుబాబు



# రివెంజ్! రివెంజ్!!

*(షాడో స్పై థ్రిల్లర్)*

రచన:

మధుబాబు

© Author
© Madhu Baabu
This digital book is published by -

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

## రివెంజ్! రివెంజ్!!

సిగిరెట్ వెలిగించుకుంటూ తాపీగా మెట్లు ఎక్కి మేడమీది వెయిటింగ్ హాల్లో అడుగుపెట్టాడు ముఖేష్.

అక్కడ పదిమందికంటె ఎక్కువలేరు. వాళ్ళు కూడా ఎవరి గొడవల్లో వారుండి పక్కవారిని గురించి పట్టించుకునే స్థితిలో లేరు.

ఒక చివరగా వున్న సోఫాలో కూర్చుని టీపాయ్ మీద వున్న న్యూస్ పేపర్ ని అందుకున్నాడు. ఎంత మంది చేతులు పడ్డాయోగాని...చివరి జీర్ణావస్థకు చేరుకుందది- ఆరోజు పేపరే.

యదాలాపంగా పేజీలు తిప్పాడు. మధ్య పేజీలలో వున్న ఒక చిన్నవార్త అతనికి నవ్వు తెప్పించింది.

"ఢిల్లీ సెంట్రల్ జైలునుంచి తప్పించుకొని పారిపోయారట ముగ్గురు ఖాదీలు. ఇద్దరు సెక్యూరిటీ గార్డులను చంపివెళ్ళారట. యావజ్జీవిత కారాగారశిక్ష అనుభవిస్తున్నారు ఆముగ్గురూ, వారిని పట్టిచ్చినా లేక ఆచూకీ తెలిపినా వెయ్యిన్నూట పదహార్లు బహుమతి

ఇస్తుందట. ఢిల్లీ పోలీసు డిపార్ట్ మెంట్." ఆవార్త కింద ఆ ముగ్గురు ఖైదీల ఫోటోలు ముద్రింపబడి వున్నాయి.

"పాపం...పోలీసుల కళ్ళుకప్పి ఎంతకాలం తప్పుకు తిరగగలరు? ఎక్కడో తప్పటడుగు వేస్తారు. వేసినవారు మరుక్షణం పట్టుబడతారు. పూర్ ఫెలోస్" అనుకొంటూ పేపర్ మీది నుంచి దృష్టిని ఆ గదిలో వున్నవారి మీదికి మరలించాడు ముఖేష్.

చండీఘుర్ లో ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు జరగబోతున్నాయని సి.ఐ.బి. కి వార్త అందింది. అసలు విషయం నికరంగా తెలుసుకోవటానికి అక్కడికి వచ్చాడు సి.ఐ.బి. సెకండ్ ఏజెంట్ మిస్టర్ ముఖేష్.

వారం రోజులపాటు ఇన్వెస్టిగేట్ చేశాడు. రోజు రోజుకూ తారాపధానికి చేరుతున్న ధరలను అదుపులో ఉంచమని కోరేటందుకు ప్రదర్శనలను ఏర్పాటు చేయబోతున్నారు కొంతమంది పురప్రముఖులు. ఆవార్తకు మరి కొన్ని రంగులు పులిమి రూమర్లను క్రియేట్ చేస్తున్నారు కొందరు వ్యక్తులు.

ఆరోజు తన రిపోర్టును కులకర్ణిగారికి పంపి, మరునాడు వెళ్ళిపోదామని నిశ్చయించుకున్నాడు ముఖేష్.

అందుకే తాపీగా కూర్చుని తనచుట్టూ వున్నవారిని పరిశీలిస్తున్నాడు. అతను కూర్చున్న సోఫాకు పది అడుగుల దూరంలో ఒక పూలకుండీ పక్కగా నలుగురు వ్యక్తులు కూర్చుని వున్నారు. ఏదో సీరియస్ గా చర్చించుకొంటున్నారు లోగొంతుకలతో.

అందరినీ చూసి ఆఖరికి వారిమీదికి తనదృష్టిని మరలించాడు ముఖేష్. ఇద్దరి ముఖాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మిగిలిన ఇద్దరి తలలకు పూలకుండీ అడ్డువుంది. కనిపించిన ముఖాలు....తెల్లగా ఎండముఖం ఎరుగనట్లు ఎన్నో సంవత్సరాలు మంచంమీదే ఉన్నట్లు - పాలిపోయి వుండటం ముఖేష్ కి కొంచెం ఆశ్చర్యాన్ని కలుగచేసింది.

వారిని ఎక్కడో చూసినట్లు అనిపించసాగింది. రెండు నిముషాలు ఆలోచించాడు. గుర్తురాలేదు. విసుగుపుట్టి ఆ ఆలోచనను విరమించుకొని పేపర్లో తలదూర్చాడు. నవ్వుతున్నట్లు కనిపించాయి పేపర్ లోని ఫోటోలు - వాళ్ళే! పారిపోయిన ఖైదీలు వాళ్ళే!! చివ్వున తల ఎత్తాడు.

ఆ మరుక్షణం అతనికి ఏం జరిగిందో అతనికి అర్ధంకాలేదు. తలమీద పిడుగులాంటి దెబ్బ ఒకటి పడింది. పక్క సోఫాల్లో వున్నవారు వెర్రిగా అరుస్తూ అటూ ఇటూ పరుగులు తీస్తున్న సవ్వడి వినిపించింది.

కమ్ముకొస్తున్న మైకాన్ని తొలగించుకోవటానికి తల విదిలిస్తూ లేచి నిలబడటానికి ప్రయత్నించాడు.

వెంటనే తళ తళా మెరుస్తున్న పేప్కప్ అతని కళ్ళ ముందు ప్రత్యక్షమయింది. విసురుగా గాలిలోకి లేచి బలంగా అతని గుండెల మీదికి దిగింది.

అప్రయత్నంగా పక్కకు దొర్లాడు ముఖేష్. ఆ పోటు ఎడమ భుజంమీద పడింది. నిప్పుకణం పెట్టినట్లు బాధ అతని నరనరాలకు వ్యాపించింది. వెచ్చటి రక్తం పిచికారిలోనుంచి వెలువడినట్లు వేగంగా వెలికివచ్చి అతని దుస్తులను తడపటం ప్రారంభించింది.

అయినా ఆగకుండా...జారిపోతున్న శక్తిని కూడగట్టుకొని లేచి నిలబడటానికే ప్రయత్నించాడు.

వెను వెంటనే మరో బాకుపోటు అతని మెడకు అంగుళం కిందుగా పడింది. మరొకటి కుడివైపు ఛాతీమీద దిగింది.

ఎవరో జుట్టుపట్టుకొని డొక్కల్లో బలంగా తన్నారు.

“రండిరా పోదాం. ఇక ఇక్కడ వ్యాపారం చేయటం ప్రమాదకరం...” అంటున్న కంఠం ఒకటి అస్పష్టంగా వినిపించింది.

సోఫామీదినుంచి కిందికి దొర్లిపోయాడు ముఖేష్. తనను దెబ్బతీసింది ఎవరో ఎందుకో అతనికి అర్థంకాలేదు, తెలిసిందల్లా ఒకే ఒక సంగతి - వాళ్ళు పారిపోతున్నారు! తన రక్తం కళ్ళచూసి తప్పించుకుంటున్నారు!!

ఆవేశం అతని బాహువులకు కొద్దిపాటి శక్తిని ప్రసాదించింది. అతి ప్రయత్నంమీద పాంటు జేబులో వున్న పిస్టల్ ని బయటికి లాగాడు. మూసుకుపోయిన కళ్ళను తెరవకుండానే...వినిపించిన కంఠానికి గురిపెట్టి ట్రిగ్గర్ నొక్కాడు.

ధన్ మని శబ్దంచేస్తూ పేలింది అది. ఆకాంక్రీట్ గదిలో పిడుగుపడినట్లు ప్రతిధ్వనించింది దాని శబ్దం.

"బాప్ రే! మర్ గయారే!!" అన్న అరుపు హృదయ విదారకంగా వినిపించింది. లావాటి మనిషి ఒకడు... కిందపడిన చప్పుడు వినవచ్చింది.

ముఖేష్ చేతిలో పిస్టల్ జారిపోయింది. చేయి చచ్చుపడిపోయినట్లు పక్కకు వాలిపోయింది. స్పృహతప్ప బోతున్న ఆఖరి క్షణంలో-- కుడిచేతి చూపుడువేలిని ధారలుగా కరుతున్న తన రక్తంలో అద్ది గచ్చుమీద ఏవో గీతలు గీశాడు. అంతే ఆ పైన స్మారకం లేకుండా పడిపోయాడు.

## 2

ఎదురుగా వున్న ఫోన్ మోతలు చేయటం ప్రరంభించగానే విసుగ్గా చూసి రిసీవర్ అందుకుంది బెట్టీ - సి.ఐ.బి. సెంట్రల్ కమ్యూనికేషన్స్ రిసెప్షనిస్టు. రిసీవర్ లో వినవచ్చిన మాటలు ఆమె ముఖంలోని విసుగును పటాపంచలు చేశాయి. కాళ్ళల్లో శక్తిలేనట్లు కుర్చీలో కూలబడి పోయింది.

“మీరు....మీరు సరిగ్గా చూశారా? నెంబర్ ని కరెక్టుగా నోట్ చేసుకున్నారా?” అడిగింది కంపిత స్వరంతో.

“యస్ మేడమ్... ఈనెంబర్ ని ఫోటో గూడా తీశాం. పొరపాటు పడటానికి అవకాశాలు లేవు. తన రక్తంతో 334466- ఢిల్లీ అని వ్రాశాడు.” వినవచ్చింది అవతలి కంఠం.

బెట్టీ గొంతుకకు ఏదో రాయిలాంటిది అడ్డుపడి మాటలు పెగలలేదు.

“హాస్పిటల్ లో చేర్పించాం. ఇంతవరకు స్పృహ రాలేదు. రక్తం విపరీతంగా కోల్పోవటం వల్ల బ్రతకటం అనుమానం అంటున్నారు డాక్టర్లు.” చెప్పుకు పోతోంది అవతలి కంఠం.

అవేమీ బెట్టీ చెవులకు వినిపించటంలేదు. నీరునిండిన ఆమె కళ్ళకు ఏదీ కనిపించటంలేదు వణుకుతున్న చేతులతో రిసీవర్ ని పెట్టేసింది. ఉబికివస్తున్న దుఃఖాన్ని దిగమ్రింగుకోవటానికి ప్రయత్నిస్తూ టేబిల్ మీద ఉన్న తెల్లని బటన్ ని నొక్కింది.

సి.ఐ.బి. మెడికల్ డిపార్ట్ మెంట్ గదులలో అలారం చెవులు గింగుర్లు ఎత్తేలా మ్రోగసాగింది. కులకర్ణిగారి గదిలో గోడల మీది రెడ్ లైట్లు వెలిగాయి.

చూస్తున్న ఫైలును అలాగే అవతలికి విసిరి బెట్టీ దగ్గరికి పరిగెత్తుకు వచ్చారు కులకర్ణి. మెడికల్ సెక్షన్ హెడ్ డాక్టర్ త్రిపాఠీ ఆదరా బాదరాగా ప్రత్యక్షమయ్యాడు ఆయన వెనుకనే.

"చండీఘుర్ పోలీసులు ట్రంక్ కాల్ చేశారు...ముఖేష్ హాస్పిటల్ లో ఉన్నాట్ట. బ్రతకటం కష్టం అంటున్నారు." అంటూ బావురుమంది బెట్టీ.

కులకర్ణిగారి గుండెలమీద సమ్మెట దెబ్బల్లా పడ్డాయి ఆమాటలు. ఒక్కక్షణంపాటు నిరుత్తరులై పోయారాయన.

ఆయన వెనుకనే వచ్చి, అంతా విన్న సులోచన అందరి కంటే ముందుగా ఆ షాక్ నుంచి తేరుకున్నది. గబగబా తన గదికి పరుగెత్తి, టేబిల్ మీదవున్న టెలీఫోన్లను డయల్ చేసి ఆర్డర్స్ పాస్ చేయటం ప్రారంభించింది.

"సెక్యూరిటీ సెక్షన్? కెప్టెన్ వాసును వెంటనే పిలిపించండి. టాప్ ప్రియారిటీ!"

"ట్రాన్స్ పోర్ట్స్? ప్లీజ్ అరేంజ్ సమ్ ట్రాన్స్ పోర్టేషన్ ఇమ్మీడియేట్లీ. వెంటనే మనం చండీఘర్ చేరుకోవాలి."

"సివిల్ రిలేషన్స్? వెంటనే జనరల్ హాస్పిటల్ కి ఫోన్ చేసి డాక్టర్ రాంప్రసాద్ నీ డాక్టర్ హేమలతనూ ప్రయాణానికి సిద్ధంగా ఉండమని చెప్పండి..."

"యస్...ఇంటర్నల్ ఎఫైర్స్? చండీఘర్ పోలీస్ డిపార్ట్ మెంట్ తో మాట్లాడి అన్ని విషయాలు తెలుసుకోండి. మేము చండీఘర్ చేరే లోగా మాకా వివరాలు కావాలి."

చేతుల్లోని రిసీవర్లను క్రింద పడవేసి మరో రెంటిని అందుకుంది సులోచన.

అప్పుడే అక్కడికి వచ్చిన కులకర్ణిగారు ఆమె వద్ద నుంచి తీసుకున్నారు వాటిని.

ఒకటి అవతలివైపు బెల్ ఇంకా మోగుతూనే ఉన్నట్లు తెలియచేస్తోంది. మరొకటి అప్పుడే మ్రోగటం ఆరంభించింది.

"హల్లో!" అన్నది ఒక రిసీవర్...

"బిందూ! రాజు ఎక్కడ?" వెంటనే అడిగారు కులకర్ణి.

"హల్లో! గుడ్ మార్నింగ్ సర్...ఇంకా నిద్ర లేవలేదు పెద్దమనిషి. ఒక్కక్షణం ఆగండి, లాక్కొస్తా" అంటూ వినవచ్చింది బిందు కంఠం.

రెండు క్షణాల తరువాత నిద్రమత్తు వదలని షాడో కంఠం కులకర్ణిగారి చెవికి చేరింది, "గుడ్ మార్నింగ్ బాస్!" అంటూ.

"రాజూ! ముఖేష్ ని ఎవరో దెబ్బకొట్టారు. చండీఘుర్ హాస్పిటల్ లో చావు బ్రతుకులమధ్య ఉన్నట్టు--"

కులకర్ణిగారి మాటలు పూర్తికాలేదు. ధన్ మంటూ టేబిల్ మీదికి విసరబడినట్లుంది రిసీవర్ -- పగిలిపోయిన శబ్దం విన వస్తుండగానే లైన్ కట్ అయిపోయింది.

అదే సమయంలో ఆయన రెండవ చేతిలోవున్న రిసీవర్ కూడ సరిగ్గా అటువంటి శబ్దమే వినవచ్చింది.

“సార్! ఐ విల్ మీట్ యూ ఇన్ చండీఘర్...” అంటున్న శ్రీకర్ కంఠం అస్పష్టంగా కులకర్ణిగారి చెవులకు చేరింది.

బరువుగా నిట్టూర్చి రిసీవర్లను కిందికి దించారాయన. సులోచన ఆఖరి ఫోన్ లో మాట్లాడుతున్నది.

“యస్ సర్...హోమ్ మినిస్టర్ గారితో అర్జెంటుగా మాట్లాడాలి. కోడ్ నెంబర్ త్రిపుల్ నైన్” ఖంగుమంటూ వినవచ్చింది హోమ్ మినిస్టర్ గారి కంఠం.

“సార్...మా ముఖేష్ ని దెబ్బతీశారు...ఇక మా వాళ్ళను పట్టుకోవటం చాలా కష్టం.”

“షాడో ! షాడో ఎక్కడ ఉన్నాడు!”

“ఈపాటికి చండీఘర్ సగం దూరంలో వుండి వుంటాడు.”

రెండు క్షణాలపాటు మౌనంగా ఉండిపోయారు హోమ్ మినిస్టర్.

సి.ఐ.బి.లో పనిచేసేవారిని గురించి ఆయనకు బాగా తెలుసు. అది నేర పరిశోధన సంస్థ కాదు. నేర పరిశోధన కుటుంబం.

"ఆల్ రైట్ కులకర్ణీ! ఇందులో మనం అతిగా ఆలోచించాల్సిన విషయం ఏమీలేదు. సి.ఐ.బి. ఏజెంటును దెబ్బ తీసిన వారిని ప్రాణాలతో వదలకూడదు. మీ యిష్టం వచ్చినట్లు చేయండి. మిగిలిన విషయాలన్నీ నేను చూసుకుంటాను. కాని కాస్త షాడో ను వెనక్కిలాగి పట్టటం బాగుంటుంది అని నా అభిప్రాయం. ముఖేష్ మీద ఈగ వాలితే వూరుకోడు మన షాడో ...ఇప్పుడు ఆవేశంతో వెనుకా ముందు చూడకుండా దూసుకుపోతాడని నాకు భయంగా వుంది. ప్రస్థుత పరిస్థితుల్లో షాడో దెబ్బ తిని మంచం ఎక్కితే మనం చిక్కుల్లో పడతాం!" ఒక్కొక్క మాట తూచి తూచి అన్నారు హోమ్ మినిస్టర్.

"అలాగే సర్...అలాగే" అంటూ రిసీవర్ ని పెట్టేసి దీర్ఘంగా నిట్టూర్చారు కులకర్ణి.

షాడోని వెనక్కులాగటమా! అదెలా సాధ్యం? వింటినుంచి వెలువడిన బాణాన్ని రివాల్వర్ లోనుంచి బయటపడిన బుల్లెట్ ను

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=249**